క్లుప్తంగా

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి : బులితిరుపతిగా పేరుగాంచిన అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై ఏడు ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి డాక్టరేట్



దారపురెడ్డి కనకమహాలక్ష్మి

తణుకు అర్బన్: శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న దారపురెడ్డి కనకమహాలక్ష్మి డాక్టరేట్ పట్టా పొందారు. 'ఇంద్రగంటి జానకీబాల కథా సాహిత్యం–పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి, డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు తెలిపారు. అధ్యాపకురాలు కనకమహాలక్ష్మిని అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ కె.ఫణిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి శిబిరం ఏర్పాటు అభినందనీయం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సాయి వీరభద్ర ట్రస్ట్ బోర్డు చైర్మన్ బుడమూరి శివశంకర్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారిచే కడకట్ల రామాలయం వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ లీలారాణి, డాక్టర్ పృధ్వీలచే పరీక్షలు జరిగాయి. పెద్ద సంఖ్యలో రోగులు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్లజోడ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు అడ్డాల నరసింహారావు, నాయకులు దాట్ల జగన్నాధరాజు, కోడే అప్పారావు, పైడారం, అడ్డాల అప్పారావు, రామిశెట్టి దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం అంగన్‌వాడీ కేంద్రంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్, పీఎంఎంవీవై పథకంపై శనివారం గర్భిణులు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ పీఎంఎంవీవై పథకం కింద ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు చేయించుకున్న వారికి రెండు దఫాలుగా రూ.11వేలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. గర్భిణులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఏఎస్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దు



దివ్యాంగుల పిల్లలకు శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా దివ్యాంగుల పిల్లలకు భరోసా కల్పిస్తున్నట్లు ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులు అతి తీవ్రత వైకల్యం కలిగి పాఠశాలలకు రాలేని దివ్యాంగుల పిల్లల ఇంటికి వెళ్లి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, ఇంటి వద్ద నేర్పించాల్సిన నైపుణ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమాలను వెల్లడించారు. దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు వద్దని, మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దని చెప్పారు. దివ్యాంగులను నార్మల్ పిల్లలతో సమానంగా చూడాలని, గౌరవించాలని, వారి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మడుగులను తలపిస్తున్న రహదారులు

- ఈ రహదారుల తీరు మారేనా?
- వర్షాలతో మరింత అధ్వానం
- నాణ్యత లోపంతో కూటమి ప్యాచ్ వర్కులు
- మూన్నాళ్ల ముచ్చటే
- యాతన పడుతున్న వాహన చోదకులు





ప్రత్తిపాడు- బాదంపూడి రహదారిలో మడుగులను తలపిస్తున్న రహదారులు





ప్రత్తిపాడు వై. జంక్షన్ నుంచి హైవే సెంటర్‌లో అస్తవ్యస్తమైన రహదారులు

పెంటపాడు: తాడేపల్లిగూడెంలో ప్రధాన రహదార్లన్నీ భారీ గుంతలతో ఛిద్రమైపోయాయి. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. గూడెంలో రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తుంది. గతంలో చిన్నపాటి గోతులపై తీవ్ర రాజకీయం చేసిన కూటమి నేతలు ఇప్పుడు వాటి విషయమై పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు ప్రకటనలు చేసినా వారి తీరు మారడం లేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రధానంగా రహదారుల తీరు మారుస్తాం. గుంతలు లేని నాణ్యమైన రోడ్లు వేస్తాం. అంటూ ప్రగల్బాలు పలికి నేడు వాటి విషయంలో కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా బాదంపూడి నుంచి ప్రత్తిపాడు, పెంటపాడు మండలంలో పలు రహదారులు గతం కన్నా మరింత గుంతలు పడి ఇబ్బందిగా తయారయ్యాయి. గత మూడు నెలల క్రితం ఈ రహదారులపై మరమ్మతులు చేశారు. దీనికి తోడు వర్షం తోడయ్యింది. ఎక్కడ గోతులు ఉన్నాయో వాహనచోదకులకు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రత్తిపాడు– బాదంపూడి మధ్య గూడెంలో ప్యాచ్‌వర్కులు చేశారు. రహదారులు వేయలేదు. కానీ గత వారం రోజుల నుంచి కురిసిన వర్షం వల్ల పై పూతగా వేసిన తారు కొట్టుకు పోయింది. పలు ప్రాంతాలలో గోతులతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రాళ్లు పైకి లేచి ఉండటంతో నానా అవస్తలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల తీరు మారుతుందని అనుకొన్న ప్రజలకు నిరాశే మిగిలిందని ప్రత్యక్షంగా ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయం నుంచి ప్రత్తిపాడు సెంటర్‌కు వెళ్లే రహదారికి ఇటీవల మరమ్మతులు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఉన్న గోతులు మరింత పెద్దవిగా తయారయ్యాయి. బాదంపూడి నుంచి ముత్యాలమ్మ గుడి వరకు, అక్కడి నుండి గూడెం కొత్త ఓవర్‌బ్రిడ్జి వరకు, తిరిగి గూడెం పట్టణం, జువ్వలపాలెం, ప్రత్తిపాడు ప్రాంతాలలో రహదార్లు గోతులమయంగా మారాయి. ఈ రహదారిపై ప్రయాణం అంటే ద్విచక్రవాహనదారులు, బస్సులు, లారీ డ్రైవర్‌లు బెంబేలెత్తుతున్నారు. భారీవాహనాలు ఈ ప్రాంతంలో తిరగడంతో అడుగుకో గుంతగా రహదారులు మారాయి. తక్షణం ఇప్పటికైనా మరమ్మతులు నాణ్యతగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్‌డే

తాడేపల్లిగూడెం: విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని యువతే సాధించగలదని జేఎన్‌టీయు కాకినాడ ఉపకులపతి సీఎస్ ఆర్‌కె ప్రసాద్ అన్నారు. పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల నాలుగవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు నాలుగేళ్ల కష్టపడి సంపాదించిన డిగ్రీ వారికి భవిష్యత్ మార్గాన్ని చూపిస్తుందన్నారు. సాంకేతిక నిపుణులుగా తయారైన విద్యార్థులు వినూత్నంగా ఆలోచించే సామర్థ్యం పెంచుకుని, సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ , మారుతున్న కాలానికి అనుగుణంగా గమనించాలన్నారు. కళాశాల ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన సత్తి శ్రీసత్యకు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందచేశారు. వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రోల్ ఆఫ్ హానర్ సాధించిన విద్యార్థులు కె.నాగలలితారత్నం, బి.శుశ్రుత, వినయ్‌కుమార్, నవ్య మాధురి, వి.మానస, సాయి వరలక్ష్మి , జ్యోత్స్నా రాణి, సాత్రక్, సత్యశ్రీలకు బంగారు పతకాలను అందచేశారు. ఐఐటీ తిరుపతి సీఎస్ఈ అధిపతి డాక్టర్ శ్రీధర్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ఓపి గోయెంకా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పట్టాలు అందచేశారు.

రైతులను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రైతుల పండించిన పంటకు బీమా చేయించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులే బీమా చెల్లించాలని వారిని గాలికొదిలేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దుయ్యబట్టారు. శనివారం రాత్రి మండలంలోని పట్టింపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ఘనుడు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రవేశపెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించారన్నారు. ఆయన అడుగు జాడల్లోనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. కూటమి ప్రభుత్వం నేటికీ ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయలేదని విమర్శించారు. రైతులు పంట దెబ్బతిన్న సీజన్‌లోనే పరిహారం వేసి వారిని ఆదుకున్నామన్నారు. గత ఏడాది పంట నష్టపోయిన రైతుల్లో 30 శాతం మందికి ఇంకా ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉందన్నారు. మళ్లీ ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు వరి నాట్లు నీట మునిగి రైతాంగం నష్టపోయిందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రూ.20వేలు ఇస్తామని చెప్పి గత ఏడాది ఎగ్గొట్టారని విమర్శించారు. అలాగే, తల్లికివందనం పేరిట రాష్ట్రంలో 87లక్షల మంది విద్యార్థులు ఉంటే 57 లక్షల మంది ఖాతాలకు సొమ్ములు జమ చేశారన్నారు. మరో 30లక్షలు మందికి ఎగ్గొట్టారన్నారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి కేవలం పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు వంటి వాటికే పరిమితం చేశారన్నారు. ఇదిలా ఉంటే ప్రతి నెలా ప్రభుత్వం అప్పులు చేస్తుందని విమర్శించారు. తొలుత ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఏయే పథకాలు అమలు జరిగాయి ? పథకాలు అందాయా ? లేదా ? అంటూ ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా స్పోక్స్ పర్సన్ ముప్పిడి సంపత్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు కర్రి భాస్కరరావు, గుండుమోగుల సాంబయ్య, వెలిశెట్టి నరేంద్రకుమార్, బొద్దాని శ్రీనివాస్, పెన్మెత్స సూర్పరాజు, గంటి చిన సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాసగాని వెంకటేశ్వర్లు, అడపా శ్రీనివాస్, గోకా వెంకటేశ్వరరావు, సిర్రాపు శాంతకుమార్, గోపిరెడ్డి దొరబాబు పాల్గొన్నారు.

ఉల్లి మార్కెట్‌లో జేసీ తనిఖీలు



గూడెం ఉల్లి మార్కెట్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్‌డీఓ తదితరులు

తాడేపల్లిగూడెం: బ్రహ్మానందరెడ్డి ఉల్లి మార్కెట్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. కర్నూలు నుంచి లారీలలో వచ్చిన ఉల్లిపాయలను ఎలా వేలం వేస్తారు. ఎలా క్రయవిక్రయాలు చేస్తారు. గ్రేడింగ్ చేసిన తర్వాత ఎగుమతులు తదితర విషయాలను వ్యాపారులను అడిగితెలుసుకున్నారు. మార్కెట్‌కు వచ్చిన కర్నూలు ఉల్లిపాయలకు కనీస మద్దతు ధర ఎందుకు రావడంలేదనే విషయాలను అడిగారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. కర్నూలు ప్రాంతంలో కురిసిన వానలకు ఉల్లి పాయలు తడిచిన కారణంతో పాటు, ఈ రకం నిల్వ ఆగక కుళ్లిపోతున్నాయని, దీంతో వినియోగదారులు ఎవ్వరూ ఈ రకం ఉల్లిని కొనుగోలు చేయడంలేదని, రైతులకు కనీస ధర వచ్చేలా చూడాలని జేసీ వ్యాపారులను కోరారు. కర్నూలు నుంచి వచ్చే ఉల్లిపాయలను రైతు బజార్లలో విక్రయించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాదంపూడి చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. కర్నూలు నుంచివచ్చే ఉల్లిపాయల లారీల వివరాలను మూవ్‌మెంటు రిజిస్టర్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కర్నూలు ఉల్లికి కనీస మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో, మార్కెటింగ్ శాఖ డీడీ పి.పాపారావు,మార్కెటింగ్ ఏడీ సునీల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహిసిల్దార్ సునీల్‌కుమార్, మార్కెటింగ్ శాఖ సెక్రటరీ గౌతు భాషా జేసీ వెంట ఉన్నారు.

చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో న్యాయ సేవా సహాయ కేంద్రాన్ని (లీగల్ ఎయిడ్ క్లీనిక్) ఏర్పాటు చేసి ప్రారంభించారు. సదస్సులో సికిందర్ బాషా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలకు పరిష్కారాలు ఎలా చేసుకోవాలి తదితర అంశాలను ప్రస్తావించారు. చట్టాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ బానో, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శివ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశాలి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. న్యాయసేవా సహాయ కేంద్రానికి పి.ప్రవీణ్ ప్రకాశ్‌ను న్యాయవాదిగాను, ఎస్.చక్రధరను పారా లీగల్ వాలంటీర్‌గాను నియమించారు. ప్రతి శనివారం ఆర్డీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వెల్లడించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో పదో తరగతి పిల్లలకు బాల్యవివాహాలు తదితర విషయాలపై న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి మాట్లాడారు. వీకర్స్‌కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ శ్రావ్య, హెచ్ఎం సత్యనారాయణ, ఎస్ఐ వెంకటరమణ, బాల బాలికలు, టీచర్లు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు తరలుతున్న గణనాథులు



చినతాడేపల్లిలో గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై నాల్గవ రోజు శనివారం మండలంలోని పలు వినాయకుని విగ్రహాలు నిమజ్జనాలకు బయల్దేరాయి. దీనిలో భాగంగా చినతాడేపల్లి గ్రామంలో నెలకొల్పిన గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి, ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి భక్తులు సాదర స్వాగతం పలికి పండ్లు, బియ్యం, టెంకాయలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం స్థానిక చెరువులో స్వామివారిని నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా యోగా పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అస్మిత యోగాసన ఉమెన్ సిటీ లీగ్ 2025–26 పోటీలు పట్టణంలోని శనివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన ఆఫ్ ఆంధ్రప్రదేశ్, యోగాసన భారత్ నిర్వహించారు. 18 ఏళ్లలోపు, పైబడి ఉమెన్ ట్రెడిషనల్ ఈవెంట్‌లు, ఫార్వర్డ్ బెండింగ్‌లో రెండు కేటాగిరిలలో 250 మంది స్త్రీలు యోగ పోటీలలో పాల్గొన్నారు. శ్రీవాసవి జీఎంఆర్ జూనియర్, డిగ్రీ, బి.ఎడ్ కళాశాల వారు వెన్యూ పార్ట్నర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా యోగాసనా స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఏపీ ప్రెసిడెంట్ ఎ.రాధిక, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కరిబండి రామకృష్ణలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ డివిజినల్ ట్రిబ్యునల్ ఏర్పాటు



ట్రిబ్యునల్ ఏర్పాటు విషయమై చర్చిస్తున్న ఆర్డీఓ, సీనియర్ సిటిజన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం అనుసరించి వారి సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సీనియర్ సిటిజన్ డివిజినల్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ బానో చైర్మన్‌గాను, కన్సిలియేషన్ (రాజీ) అధికారులుగా కొటికలపూడి చిట్టి వెంకయ్య (ఇరగవరం), యం.డి.ముస్తఫా (తాడేపల్లిగూడెం), వంగపండు రామ్మోహన్‌రావు (తాడేపల్లిగూడెం)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ట్రిబ్యునల్ ఏర్పాటుతో సీనియర్ సిటిజన్స్ సమస్యలు తొలగుతాయని, ఆయా సమస్యలను రాజీ మార్గం చేసేందుకు కృషి జరుగుతుందని, ట్రిబ్యునల్ సభ్యులను పలువురు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు వీకే వీరారావు, గూడెం యూనిట్ అధ్యక్షుడు కె.బాలకృష్ణలు అభినందించారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి



తణుకులో డాక్టర్ వందనను సత్కరించిన కళాశాల కరస్పాండెంట్ సత్య ఉషారాణి

తణుకు అర్బన్: ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు మాట్లాడుతూ విద్యార్థినులంతా అధ్యాపకులు అందిస్తున్న విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకోవాలని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గైనిక్ వైద్యురాలు డాక్టర్ కుందుల నాగవందన మాట్లాడుతూ ఇంటర్ విద్య భవిష్యత్తుకు పునాదిలాంటిదని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థినులు విద్యతోపాటు యోగా, ధ్యానం, క్రీడలపై దృష్టి సారించాలని, ఒకరితో ఒకరు ఐకమత్యంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, నందిగం సుధాకర్, వీవీవీ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోతాదు మించితే మొదటికే మోసం

- ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలి
- అవసరం మేరకే వాడాలి



ఇరగవరంలో ఎరువులు చల్లుతున్న రైతులు

ఇరగవరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు అధిక దిగుబడులు సాధించాలనే తపనలో అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులను వాడి నష్టాలను కొని తెచ్చుకుంటున్నారని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. సాగులో ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా మంచి దిగుబడులు పొందడంతో పాటు భూమి సారాన్ని కాపాడుకోవచ్చంటున్నారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం దేశంలో గత ఆర్థిక సంవత్సరంలో ఎకరానికి సగటున 56కిలోల యూరియాను రైతులు వాడారు. అయితే మన జిల్లాలో మాత్రం 90కిలోలు పైనే వాడటం గమనార్హం. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయం ద్వారా ఒకవైపు ప్రయత్నాలు చేస్తుంటే జిల్లాలోని రైతులు మాత్రం ఎంత ఎక్కువ ఎరువులను వాడి అంత ఎక్కువ పంట దిగుబడులు వస్తాయనే భ్రమలో నష్టాల పాలవుతున్నారు. తాడేపల్లిగూడెం కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా ఎరువాక కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ సాగులో ఎరువుల వినియోగంపై రైతులును చైతన్యపరిచేలా కృషి చేస్తున్నారు.

భూసారం దెబ్బతింటుంది

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్‌ల నాలుగు లేదా రెండు పాళ్లుగా వాడతారు. కానీ జిల్లాలో చాలామంది రైతులు నత్రజనని 8నుంచి 12పాళ్ల వాడతున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతింటుంది. వరి నాట్లు వేసే సమయంలో 50కిలోల డీఏపీకి 25కిలోల యూరియా, 15కిలోల పొటాష్ కలపాలి, కానీ కొంతమంది రైతులు ఏకంగా 60కిలోలు యూరియానే వాడేస్తున్నారు. ఇక నాట్లు వేసిన 30రోజులు తరువాత రెండో విడతగా ఎకరానికి 25కిలోల యూరియాను వాడొచ్చు. లేకుంటే పావు లీటరు నానో యూరియాను పిచికారీ చేయవచ్చు. పంట వేసిన 45రోజుల తరువాత మరోసారి 25కిలోల యూరియాతో 15 కిలోలు పొటాష్‌ని కలిపి వాడాలి. లేదంటే అర లీటరు నానో యూరియాను వాడవచ్చు.

అధికంగా వాడడం నష్టమే



అవసరానికి మించి అధిక మోతాదులో ఎరువులను వినియోగించడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదంటున్నారు. దీని వలన ఖర్చు పెరిగి, రైతులపై ఆర్థిక భారం కూడా పెరుగుతుంది. తప్ప పంట దిగుబడు లు పెరగవనే విషయాన్ని గ్రహించాలని ఎరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో సుమారు 70వేల హెక్టార్ల వరి సాగు జరుగుతుంటే, దీనిలో ఏడు నుంచి పదివేల ఎకరాలలో ప్రకతి వ్యవసాయం జరుగుతుంది. మరో 30నుంచి 35వేల హెక్టార్లలో వివిధ రకాల కషాయాలతో తయారు చేసిన ఎరువులను వినియోగిస్తున్నారని వ్యవసాయశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఈ కమతాలోనే మధ్యమధ్యో యూరియాను కూడా వినియోగిస్తున్నారు.

– వై.రాఘవేంద్రరావు, ఇరగవరం మండల వ్యవసాయాధికారి.